
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శుక్రవారం 4 ఏప్రిల్ 2025

వివాహేతర బంధం
యమపాశం

- అడ్డుతొలగించుకోవాలని హత్య
- జీవితమంతా జైలుపాలు
- ఇటీవల చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర ఘటనలు
- పతనమవుతున్న నైతిక విలువలు
- పోలీసుశాఖ తరఫున అవగాహన అవసరం 7

జోరుగా ఇసుక దందా

- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- రోజుకు 50 ట్రిప్పులు తరలింపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు 8

సన్నబియ్యం పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యంను పంపిణీ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామంలో తెల్లరేషన్‌కార్డుదారులకు సన్న బియ్యంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం దేశంలో కాంగ్రెస్ పార్టీ



సదాశివపేట మండలం వెల్టూర్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి

తెచ్చిన పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా ఉంటాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, తహసీల్దార్ కె.సరస్వతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయబ్ తహసీల్దార్ వీరేశం, మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు వెల్టూర్ ప్రభు, నవీన్, సామెల్, గ్రామ పంచాయితీ కార్యదర్శి అనీల్, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్

ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్‌తో పాటు అన్నీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని సిద్దిపేట జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. గురువారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో నేటి నుంచి డివిజన్ల వారీగా, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రైవేట్ ఆసుపత్రుల పనితీరుపైన పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఆరోగ్య సేవలకు సంబంధించి చికిత్సకు ధరల పట్టిక, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్టేజ్, అన్ని రకాల, ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్యుల పేర్లు, సిబ్బంది పత్రాలతో కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యాలు వైద్యులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 ప్రకారం కొత్తగా రిజిస్ట్రేషన్, గడువు ముగిసిన తర్వాత రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన సమీక్షలు నిర్వహించాలని, కార్యక్రమాల పనితీరుపైన ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన వైద్యులు అన్నివేళలా అందుబాటులో ఉండి, ఓపీ సంఖ్య పెంచే విధంగా సుఖ ప్రసవాలు జరిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అధికారులు డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఆనంద్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీకళ పాల్గొన్నారు.

అకాల వర్షం

- జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షం
- గోడ కూలి ఒకరి మృతి.. పలుచోట్ల దెబ్బతిన్న పంటలు



వర్షానికి కొట్టుకుపోయిన మక్కలు

సిద్దిపేట టౌన్/గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో విక్రయించడానికి తీసుకువచ్చిన సన్‌ఫ్లవర్ కుప్పలు తడిసిపోయి... పలువురికి సంబంధించిన సన్‌ఫ్లవర్ కొట్టుకుపోయింది. ప్రజ్ఞాపూర్‌లో వీచిన గాలిదుమారానికి పలువురు రైతులకు సంబంధించిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. చేతికి వచ్చిన వరి పంట రాలిపోయింది. ఆయా గ్రామాల్లో కూరగాయల పంటల దెబ్బతినగా, అకాలం నష్టం అపార నష్టాన్ని కలిగించింది. సిద్దిపేట మార్కెట్ యార్డులో మక్కలు తడవకుండా కవర్లు కప్పారు.

జాలిగామ వద్ద..

గజ్వేల్ మండలం జాలిగామ వద్ద గోడౌన్ నిర్మాణంలో భాగంగా ఎలక్ట్రీషియన్ పని చేస్తున్న గజ్వేల్ పట్టణానికి చెందిన ఇమ్మత్‌ఖాన్(47) గోడ కూలి మృతిచెందాడు. గోడౌన్‌లో పని నిమిత్తం వచ్చిన ఆయన వర్షం పడుతుండగానే మూత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా గోడౌన్ ప్రహరీ కూలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రహరి గోడ పెచ్చుల మధ్యలో ఇమ్మత్‌ఖాన్ మృతదేహం ఇరుక్కుపోయింది. విషయం తెలిసిన పలువురు అక్కడకు చేరుకుని ఇమ్మత్‌ఖాన్ మృతదేహాన్ని బురదలో నుంచి బయటకు తీసుకువచ్చారు. కాగా ఇమ్మత్‌ఖాన్ గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్‌కు స్వయానా సోదరుడు. కాగా ఇమ్మత్‌ఖాన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. వర్గల్ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గౌరారం రాజీవ్ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచాయి. దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో రోడ్లని జలమయమయ్యాయి.



అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

మరో రెండు, మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని పలు పట్టణాల్లో ఎక్కడా కూడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాడుబడ్డ ఇళ్ల నుండి ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



సిద్దిపేటలో గొడుగులు పట్టుకుని వెళ్తున్న ప్రజలు



గజ్వేల్ మార్కెట్ యార్డులో తడిసిన విత్తనాలను ఎత్తుతున్న రైతు



పొద్దుతిరుగుడు విత్తనాలను షెడ్ కిందకు చేర్చిన రైతులు

బుల్డోజర్ పాలన

- హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా బీఆర్ఎస్వీ నిరసన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సెలవు రోజుల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం రేవంత్ సర్కార్‌కు సిగ్గుచేటు అని సిద్దిపేట బీఆర్ఎస్వీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వం కాదని.. బుల్డోజర్ల పాలన ప్రభుత్వమని ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా సిద్దిపేటలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలో నిరసన తెలిపారు. క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ప్రజాసమస్యల మీద కాకుండా రాష్ట్ర భూములపై దృష్టి సారించిందని విమర్శించారు. హైదరాబాద్ ప్రాంత ప్రజల ఆయువు హెచ్‌సీయూ అటవీ ప్రాంతమని, ఎన్నో రకాల వన్య ప్రాణులకు ఔషధ మొక్కలకు నిలయమైన యూనివర్సిటీ భూమిని రేవంత్ తన ఆదాయ సమీకరణల కోసం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూనివర్శిటీ భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించేంవరకు విద్యార్థులతో కలసి బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షులు, బీఆర్ఎస్వీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు



బందారంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ

- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌కార్డు కలిగిన అందరికీ సన్నబియ్యం పం పిణీ సక్రమంగా జరపాలని కలెక్టర్ మను చౌద రి సూచించారు. కొండపాక మండలం బందారంలో చౌక ధరల దుకాణంలో సన్నబియం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జిల్లాలో అన్ని రేషన్ షాపులో రేషన్ కార్డుదారులకు అందజేస్తున్నామన్నారు. పంపిణీ వ్యవస్థలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చూసుకోవాలని చెప్పారు. తప్పనిసరిగా ఈ-పాస్ మెషిన్‌లలో అప్‌లోడ్ చేశాకే బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. రేషన్‌కార్డుదారులు ప్రతిఒక్కరూ సరుకులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సూచించారు. రేషన్ కార్డు కలిగి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం అందజేస్తున్న 6 కిలోల సన్న బియ్యం తీసుకోవాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం సన్నబియ్యం పంపిణీ చేశారు. బందారం చౌక ధరల దుకాణంలో 621 రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారని ప్రతి నెలా 580 మంది రేషన్‌కార్డుదారులు తప్పకుండా సరుకులు తీసుకుంటారని, ఈనెల సన్న బియ్యం 124 క్వింటాళ్లు వచ్చాయని రేషన్ డీలర్ బైతి స్వామి కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి తనూజ, మండల తహసీల్దార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ డైట్ పాటించాలి

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఇస్లామియా కళాశాలలో కొనసాగుతున్న తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ మను చౌదరి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురుకుల ప్రాంగణంలోని తరగతి గదులను, భోజనశాలను, వంటశాలను తనిఖీ చేశారు. బాత్‌రూంలు, టాయిలెట్స్‌ను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో కామన్ డైట్ మెనూ తప్పకుండా పాటించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఐదోతరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. రోజు న్యూస్ పేపర్ చదవాలని, తరగతి గదిలో ఉపాధ్యాయులను ప్రశ్నలు ఎక్కువగా అడగాలని సూచించారు. అనంతరం రంగధాంపల్లి శివారులో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌ను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు.

కొనుగోళ్లు చేపట్టాలని రైతుల ఆందోళన



తొగుట మార్కెట్ యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

తొగుట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పొద్దుతిరుగుడు గింజలు కొనుగోలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ తొగుట మార్కెట్ యార్డులో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు బీఆర్ఎస్ నేతలు మద్దతు పలకడంతో మార్కె ట్ యార్డు ముందు పొద్దుతిరుగుడు గింజలను రోడ్డుపై పోసి అక్కడే బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 15 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయినా పట్టించుకోకపోవడం ఏంటని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి మండిపడ్డారు. గత నెల 3న తొగుటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు ఆతర్వాత 21 వరకు కొనుగోళ్లు చేసి నిలిపివేశారని ఆరోపించారు. ఇంకా మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు గింజల నిల్వలు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చివరి గింజ వరకు కొనుగోళ్లు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు అక్కడికి చేరుకుని వారితో మా ట్లాడి ఆందోళన విరమింపచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రైతులతో కలిసి ర్యాలీగా తొగుట తహసీల్దార్ కార్యాలయంకు చేరుకుని కొనుగోళ్లు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, నాయకులు కనకయ్య, యాదగిరి, నరేందర్‌గౌడ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం



తొగుటలో పాదయాత్ర చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, కాంగ్రెస్ నాయకులు

తొగుట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. గురువారం తొగుట మండలం నుంచి కాన్గల్ వరకు జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ సమానత్వం స్వేచ్ఛను ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాశారని చెప్పారు. ప్రజల హక్కులను కాలరాసి రాజ్యాంగాన్ని మార్చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణాల పేదల సం క్షేమం ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. అంతకు ముందు తొగుట ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రాజీవ్ యువవికాసం దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం తొగుటలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి పార్టీ జెండాను ఎగురవేసి పాదయాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి తుక్కాపూర్‌కు చేరుకుని రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్ విజయ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, పోచయ్య, గంట రవీందర్, మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి, ఉప్పలయ్య, స్వామి, నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులకు, మైనార్టీలకు రక్షణ కరువు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి); దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేటరూరల్ మండలం తోర్నాల, ఇర్కోడు, రాంపూర్ మరియు నారాయణరావుపేట మండలం మల్యాల, గుర్రాలగొంది గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడారు. అనంతరం తోర్నాలలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంప మహేందర్, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, పట్టణ అధ్యక్షుడు అత్తు, నాయకులు గుర్రం అంజిరెడ్డి, సదాశివరెడ్డి, బండి శివ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తోర్నాలలో కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

నేతల మధ్య వాగ్వాదం..తోపులాట

సిద్దిపేటరూరల్ మండలం తోర్నాలలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పాదయాత్రలో పలువురు నేతల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. రూరల్ మం డలం నేతల ప్రొటోకాల్ విషయంలో ఒక్కసారిగా కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకోవడంతో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సమక్షంలోనే ప్రొటోకాల్ విబేధాలు తలెత్తడంతో పలువురు సొంతపార్టీ నాయకులు, కార్యకర్తల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి..

అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతులు మృతి

నంగునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతులు మృతి చెందిన సంఘటన నంగునూరులో గురువారం తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ సంఘటనలో ఇందుకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. నంగునూరు గ్రామానికి చెందిన నంగునూరుకు చెందిన ఆవుల కొమురయ్య (80), భూదవ్వ (75) భార్యభర్తలు. భూదవ్వకు మంత్రాలు వస్తాయనే నెపంతో ఇంటి చుట్టుపక్కల వాళ్ల వేధింపులకు గురిచేయడంతో భరించలేక వ్యవసాయ బావి వద్ద ఉంటూ జీవిస్తున్నారు. వారి కుమారుడు పరుశరాములు ప్రతిరోజూ భోజనం తెచ్చి ఇస్తుంటాడు. ప్రతిరోజు ఉదయం లేవగానే వ్యవసాయ పొలం చుట్టూ తండ్రి కొమురయ్య తిరుగుతూ వ్యవసాయ పనులు చూసేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన వృద్ధ దంపతుల కుమారుడు పరుశరాములకు అమ్మానాన్న కనిపించకపోవడంతో వారు ఉండే రూమ్ దగ్గర వెళ్లి చూడగా లోపల నుంచి తలుపు గడియ పెట్టుకొని ఉన్నారు. ఎంతకు పిలిచినా లేవకపోవడంతో సమీపంలోని రైతుల సహాయంతో డోర్‌ను పగలగొట్టి చూడగా విగతజీవులై కనిపించారు. భార్య భర్తలు ఒకేసారి చనిపోవడంతో విషయాన్ని రాజగోపాల్‌పేట పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసిఫ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు జాగిలాలతో చుట్టుపక్కల గాలించారు. ఎలాంటి ఆనవాళ్లు దొరకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధ దంపతుల మృతిపై పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరన్న విష ప్రయోగం చేశారా, లేక వారే ఏమైనా తీసుకొని మరణించారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వృద్ధ దంపతుల మృతిపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.భార్యాభర్తలు ఒకేసారి మృతి చెందడంతో ఎవరికైనా అనుమానం వస్తుందని అదే కోణంలో పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా పరిశోధన నిర్వహిస్తామని ఏసిపి మధు తెలిపారు. వృద్ధ దంపతులకు కుమారుడు పరశురాములు, కోడలు పావని, ఇద్దరు కుమార్తెలు రేణుక, నాగవ్వ ఉన్నారు.




కొమురయ్య, భూదవ్వ (ఫైల్)

బ్రహ్మోత్సవాలకు ఇందుప్రియాల్ సీతారామచంద్రస్వామి ఆలయం ముస్తాబు



ఇందుప్రియాల్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం

దౌల్తాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి 11 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్‌రెడ్డి తెలిపారు. 10న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి తూప్రాన్ రామాలయ బ్రహ్మోత్సవాలు

తూప్రాన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పురాతన రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయంలో ఈనెల 4న శుక్రవారం నుంచి 13న ఆదివారం వరకు 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బజారు రవీంద్ర తెలిపారు. 13న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.



తూప్రాన్ రామాలయం

క్రైం కార్నర్

అన్నం.. తింటూనే వదిలిన ప్రాణం

● సిద్దిపేట జిల్లా హబ్షీపూర్‌లో విషాదం



భాగ్యమ్మ(ఫైల్)

సిద్దిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పెట్టుకున్న అన్నం పళ్లెంలోనే ఉంది... రెండు బుక్కలు కూడా తినలేదు.. ఎంగిలి చేతుతోనే గోడకు అచేతనంగా ఒరిగి, ప్రాణాలొదిలిన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో గురువారం విషాదంను నింపింది. గ్రామానికి చెందిన కుక్కడగల భాగ్యమ్మ(42) వ్యవసాయ కూలీగా పని చేస్తుంది. ఆమె భర్త రమేష్ 18 ఏళ్ల క్రితం మరణించాడు. వారికి ఇద్దరు కుమారులు సురేష్, స్వామి ఉండగా వారు సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఒంటరిగానే గ్రామంలో ఉంటున్న భాగ్యమ్మను బుధవారం రాత్రి అదే గ్రామంలో హోటల్‌లో పని చేస్తున్న ఆమె తమ్ముడు పరమేశ్వర్ వచ్చి పలకరించారు. రాత్రి తిని పడుకోవాలని సూచించి వెళ్లిపోయాడు. పరమేశ్వర్ గురువారం ఉదయం వచ్చి చూసే సరికి అక్క అన్నం పళ్లెంను ముందు పెట్టుకుని, ఎంగిలి చేతుతోనే గోడకు ఒరిగి అచేతనంగా పడి ఉంది. వెంటనే స్థానికులు ఆమెను చూసేసరికి ప్రాణాలొదిలినట్టుగా తేలింది. దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

మునిపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన బుదేరా చౌరస్తాలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికలు, పోలీసులు వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుదేరా గ్రామానికి చెందిన వనంపల్లి రమేష్(45) మోటారుసైకిల్‌పై బుదేరా చౌరస్తాలోని ఓ హోటల్‌లో గురువారం రాత్రి టీ తాగేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఫ్లైఓవర్ (సర్వీస్) రోడ్డు వద్దకు రాగానే సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న క్వాలిస్ వాహనం మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. రమేష్‌కి బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. కాగా, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరుబుదేరా, గొర్రెగట్టు గ్రామాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



నరేశ్(ఫైల్)

పాపన్నపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పాపన్నపేట మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నార్సింగి గ్రామానికి చెందిన నరేష్ కుమార్(26)కు తన భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నరేష్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి నరేశ్ కుంటుంబానికి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

సెంట్రింగ్ పని చేస్తూ జారి పడి మేస్త్రీ మృతి



బాగేలే మృతదేహం

చేగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి మేస్త్రీ మృతిచెందిన సంఘటన చేగుంట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మ జిల్లా కోద్రిపాల్ గ్రామానికి చెందిన బూంది బాగేలే(40) చేగుంట మండలంలోని చిట్టోజీపల్లి గ్రామం జీటెక్ పరిశ్రమలో భవన నిర్మాణంలో సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. బుధవారం పనిలో ఉండగా ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి వారు వెంటనే నర్సింగ్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బూంది బాగేలే కుమారుడు విజయ్ బాగేలే ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం పంపించారు.

అదృశ్యమైన మహిళ.. కుళ్లిన స్థితిలో శవమై లభ్యం



బుజిలీ(ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల క్రితం అదృశ్యమైన మహిళ నర్సాపూర్-మెదక్ రహదారి పక్కన కాలువలో కుళ్లిపోయిన శవంగా కనిపించిన ఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన బుజిలీ(52) గత నెల 25వ తేదీన నర్సాపూర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టపక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికగా, ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం నర్సాపూర్-మెదక్ రహదారి పక్కన అటవీశాఖ తవ్వించిన కాలువలో కుళ్లిన స్థితిలో శవమై కనిపించింది. మృతుదేహంపై చీర, నగలు, ఇతర ఆనవాలు గుర్తించి బుజిలీగా నిర్ధారించారు. దర్యాప్తు అనంతరం పూర్తివివరాలు తెలియజేస్తామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

ఎండు గంజాయి, నాటు తుపాకీ స్వాధీనం

జిన్నారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం దోమడుగులో ఓ వ్యక్తి వద్ద కేజీ ఎండు గంజాయి, ఒక నాటు తుపాకీని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఉపేందర్ దోమడుగులో ఉండే తన నివాసంలో గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కేజీ ఎండు గంజాయి, ఒక నాటు తుపాకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఘనంగా గోకులాశ్రమం బ్రహ్మోత్సవాలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మానవులందరికీ ధర్మాచరణ ఆరోగ్య ఆహార విధానం తోటి ప్రాణుల సంరక్షణ మొదలైన విషయాలపై అవగాహన కల్పించడం కొరకు వశిష్టపరంపర ఆధ్యాత్మిక ట్రస్టు కృషి చేస్తుందని ట్రస్టు వ్యవస్థాపక సభ్యుడు మాత సరళాదేవి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలో గోకులాశ్రమం స్థాపించి 15 సంవత్సరాలు నిండిన సందర్భంగా గురువారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ఇప్పటివరకు 300 మంది శిష్యులకు గోకుల ఆశ్రమంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గోకులాశ్రమ వ్యవస్థాపకులు మధుసూదనార్యులు, ఆధ్యాత్మిక గురువులు సత్యజిత్, ఆస్ట్రాలజిస్ట్ ఎస్వీఎస్ రాజా, ట్రస్టు సభ్యులు మోహనయ్య తదితరులు పాల్గొన్నారు.

మా భూమి రథయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో ఏప్రిల్ 14న ప్రారంభమయ్యే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో ఏప్రిల్ నిర్వహించే ఈ రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం సిద్దిపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. విశారదన్ మహారాజు చేపట్టిన ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీ అణగారిన వర్గాల ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగించి రాజ్యాధికారాన్ని స్థాపించడమే ధ్యేయంగా ధర్మ సమాజ్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జ్యోతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



వివాహేతర బంధం.. యమపాశం

ముగ్గురు పిల్లలను తల్లే టవల్‌తో గట్టిగా అదిమి ఊపిరాడకుండా చంపిన దిగ్భ్రాంతికర ఘటన పోలీసుల విచారణలో రెండురోజుల క్రితం వెలుగుచూసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడలో ఉంటున్న మహిళ ప్రియుడి మోజులో కళ్లుమూసుకుపోయి.. అతడితో తన పెళ్లికి పిల్లలే అడ్డుగా ఉన్నారని.. పేగు తెంచుకుని పుట్టారన్న మమకారాన్ని మర్చిపోయింది. గత నెల 27వ తేదీన ముగ్గురు పిల్లలను నిర్దాక్షిణ్యంగా కడతేర్చడం సంచలనం రేపింది.

సదాశివపేట మండలంలోని నందికంది గ్రామానికి చెందిన 39 ఏళ్ల మహిళతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి(45) వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెపై మోజు తీరాక ఆమె కూతురుపై కన్నేసాడు. ఈ విషయాన్ని ఆమె గ్రామస్థులకు చెబుతానని బెదిరించింది. దీంతో ఆగ్రహానికి గురైన వ్యక్తి ఫిబ్రవరి 27న మహిళను బండరాయితో తలపై కొట్టి దారుణంగా హత్య చేసి కటకటాల పాలయ్యాడు.

సోషల్ వేల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మహిళ సంగారెడ్డిలోని ఓ జిమ్‌లో శిక్షకుడిగా పనిచేస్తున్న వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. ఈ విషయం తెలిసిన భర్త తమ బంధానికి అడ్డుపడుతున్నాడని ప్రియుడు, ఓ కానిస్టేబుల్‌తో కలిసి ఫిబ్రవరి 20న హత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఎనిమిది రోజుల తరువాత ప్రాణాలొదిలాడు. దీనికి కారణమైన భార్య, ప్రియుడు, కానిస్టేబుల్ ఊసలు లెక్కిస్తున్నారు.

కంగ్టి మండలం తుర్కవడగాం గ్రామానికి చెందిన వ్యక్తి(55)కి ముప్పై ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె వివాహం కాగా, ముగ్గురు చదువుకుంటున్నారు. కొన్ని రోజులుగా భార్యపై అనుమానం పెంచుకున్న సదరు వ్యక్తి ఫిబ్రవరి 18వ తేదీన మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేసి చంపేశాడు. అతడు జైలుపాలు కావడంతో పిల్లల బతుకు అగమ్యగోచరమైంది.

నిజాంపేట మండలం నాగ్‌దర్‌రాంచెందర్ తండాకు చెందిన యువకుడు(30) పెళ్లి కాగా, సంగారెడ్డిలోని ఓ పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్ తండాకు చెందిన వ్యక్తి సదరు యువకుడు తన కూతురితో సన్నిహితంగా ఉంటున్నాడని ఫిబ్రవరి 12న హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలుముక్కలుగా చేసి నిజాంపేట మండలం ఈదుల్‌తండా గుట్టల్లో పడేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. దీంతో మృతుడి భార్య, పిల్లలు, నిందితుడి భార్య, పిల్లలకు కుటుంబపెద్ద లేకుండా పోయారు.

అడ్డుతొలగించుకోవాలని హత్య
జీవితమంతా జైలుపాలు
ఇటీవల చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర ఘటనలు
పతనమవుతున్న నైతిక విలువలు
పోలీసు శాఖ తరపున అవగాహన అవసరం

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధాలు మనిషిలోని మానవత్వాన్ని చంపేస్తున్నాయి. పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. మూడుముళ్ల బంధాన్ని కాలరాస్తున్నాయి. పరాయి వారి మోజులో పడి అటు భర్తలు, ఇటు భార్యలు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆ కారణంగా తమ వారినే అడ్డు తొలగించుకొనేందుకు చివరకు హత్యలకు పూనుకుంటున్నారు. దీంతో నడి వయస్సులోనే తమ జీవితాలను జైలు పాలు చేసుకుంటున్న వారు కొందరైతే, 20,30 ఏళ్ల పాటు కాపురం చేసి అనుమానమనే పెను భూతంతో జీవితాలను నాశనం చేసుకుంటున్న వారు మరి కొందరు. కుటుంబంలో ఒకరు హతమవడం, మరొకరు జైలుకెళ్లడంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. గత బంధాన్ని అడ్డుతొలగించుకునే ప్రయత్నంలో అభంశుభం తెలియని చిన్నారులను సైతం బలిగొంటున్న దారుణ ఘటనలు కలిచివేస్తున్నాయి. సమాజంలో నైతిక విలవల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కుటుంబాలు కకావికలం

వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యలతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. మానవత్వం మరిచి భాగస్వాములనే కడతేర్చడంతో బాధిత కుటుంబీకులు కకావికలమవుతున్నాయి. కుటుంబంలో ఒకరు నేరం చేస్తే మిగిలి వారందరికీ సమాజంలో ఒక రకమైన చెడుబావన కలుగుతోంది. వారిని దగ్గరకు రానివ్వడం లేదు. వారి కులాల్లో బంధువులు సైతం ఏ శుభకార్యానికి పిలవడం లేదు. నేరం తర్వాత కుటుంబం రోడ్డున పడటం జరుగుతోంది.

అవగాహన కార్యక్రమాలు అవసరం

గతంలో మూఢనమ్మకాల నెపంతో నిరక్షరాస్యత కారణంగా హత్యలు చోటుచేసుకొనేవి. ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పటికీ నేరాలు మాత్రం అదేస్థాయిలో పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాలు ప్రభావం తీవ్రంగా చూపుతోంది. ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో మంచి కంటే ఎక్కువగా చెడు విషయాలకే బానిసలవుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో చాటింగ్‌లు వివాహేతర బంధాలకు తీరి తీస్తున్నాయి. విషయం కుటుంబంలో తెలియడంతో అయిన వారినే హతమార్చేందుకు సైతం వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. మరొకరి మోజులో పడి కుటుంబీకులను కడతేరిస్తే ఆ తర్వాత జీవితం జైలుపాలు కావడంతో పాటు మిగిలిన కుటుంబీకుల పరిస్థితి దైన్యంగా వుంటుందన్న విషయాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్షణికావేశంలోనే హత్యలు



క్షణికావేశంలోనే కొందరు హత్యలకు పాల్పడుతున్నారు. వివాహేతర సంబంధాలు చివరకు విషాదంగానే ముగుస్తాయన్న విషయాన్ని గుర్తించాలి. వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యలతో కుటుంబాలు చితికిపోతున్నాయి. చిన్నారులు అనాథలవుతున్నారు. పెద్దవారు రోడ్డున పడుతున్నారు. ఒత్తిడి, క్షణికావేశం కారణంగా అఘాయిత్యాలకు పాల్పడటం, లేదా హత్యలు చేయడం జరుగుతోంది. దీంతో నిండు జీవితం జైలు పాలవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. హత్యానేరాలు చేయడం వల్ల కుటుంబాల్లో చోటు చేసుకొనే పరిస్థితులను వివరిస్తూ జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

మున్సిపాలిటీలకు అవార్డులు

● పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధించిన బల్దియా కమిషనర్లకు అభినందన
● అవార్డును అందజేసిన సీడీఎంఏ శ్రీదేవి




ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సిద్దిపేట కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలులో లక్ష్యాన్ని అధిగమించినందుకు నారాయణఖేడ్ మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో ఈ అవార్డును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరక్టర్(సీడీఎంఏ) శ్రీదేవి అందించారు. ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి నారాయణఖేడ్ మున్సిపాలిటీ 2023-2024, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి పన్నులను వసూలు చేసినందుకు ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో రూ.2.62 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా, 2023-2024 సంవత్సరంలో 85 శాతం, 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 86.55 శాతం వసూలు చేశారు. దీంతో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేసి, అవార్డు అందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది సమిష్టిగా పనిచేయడం, పట్టణ ప్రజలు సహకరంతోనే ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైందన్నారు.

వెల్‌డన్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్‌కు ఆదాయవనరులు పెంచడంతో పాటు 2024-2025 గాను రాష్ట్రంలో 84.15 శాతం పన్ను వసూలు చేసినందుకు గురువారం హైదరాబాద్‌లో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను సీడీఎంఏ శ్రీదేవి వెల్‌డన్ అంటూ అభినందిస్తూ, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో పన్ను వసూలు చేయగలిగామని, సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్ని రంగాల్లో సిద్దిపేట పట్టణాన్ని ముందంజలో ఉంచుటకు కృషి చేస్తామన్నారు.

తూప్రాన్ మున్సిపాలిటీకి..

తూప్రాన్ (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మున్సిపాలిటీ 2024-25లో 82.17శాతం పన్ను వసూళ్లను చేపట్టారు. దీంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరక్టర్ శ్రీదేవి చేతుల మీదగా కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన మేనేజర్ రఘువరన్, సిబ్బందిని అభినందించారు.

జోగిపేట మున్సిపాలిటీకి ప్రశంసాపత్రం



జోగిపేట, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతికి అరుదైన ప్రశంస లభించింది. ఈఏడాది 75 % పైగా పన్నులు వసూలు చేపట్టడం పట్ల, పురపాలక శాఖ సీడీఎంఏ శ్రీదేవి గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతిని అభినందించింది ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ అందరి ఉద్యోగుల కృషి, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించడంతోనే ఉత్తమంగా నిలిచామని తెలిపారు.

సమాజ శ్రేయస్సుకు కృత్రిమ మేధ

● గీతం అంతర్జాతీయ గ్రీన్ ఏఐ-2025 సదస్సులో పిలుపునిచ్చిన వక్తలు




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సామాజిక శ్రేయస్సు కోసం కృత్రిమ మేధను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతర్జాతీయ సహకారం అవసరమని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రీన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇండస్ట్రియల్ అప్లికేషన్స్' (గ్రీన్ ఏఐ-2025) అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయ ఎమెరిటస్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ పూజారి, ఒడిశాలోని ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సచ్చిదానంద దేహూరి వంటి విద్యావేత్తలు ఈ సదస్సుకు శ్రీకారం చుట్టారు. సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అరుణ్ 'ఇంటర్ ప్రెటబుల్ క్లస్టరింగ్'పై లోతైన అవగాహన కల్పించేలా కీలకోపన్యాసం చేశారు. గ్రీన్ ఏఐ అభివృద్ధి చెందుతున్న రంగమని, ఇటువంటి ట్రెడింగ్ రంగంపై గీతం అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. ఈ సదస్సు ఏఐ, అధిక - పనితీరు గల కంప్యూటింగ్‌లో కొత్త పరిశోధనా మార్గాలు, వినూత్న అంశాలతో స్ఫూర్తినిస్తుందని ప్రొఫెసర్ అరుణ్ ఆశాభావం వ్యక్తపరిచారు. దక్షిణ కొరియాలోని యోన్సే విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సంగ్- బేచో వర్చువల్‌గా 'డీప్ లెర్నింగ్'పై ఇటీవలి వినూత్న రచనలు: సాఫ్ట్ కంప్యూటింగ్ ల్యాబ్ యొక్క దృక్పథాలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ సచ్చిదానంద దేహూరి 'మెషిన్ లెర్నింగ్‌లో పరేటో ఫ్రంట్‌ను వెలికితీయడం'పై ఉపన్యసిస్తూ, ఏఐ-ఆధారిత పరిష్కారాలలో ఆప్టిమైజేషన్ పద్ధతులపై విలువైన సమాచారాన్ని తెలిపారు.

ఆఫ్‌లైన్‌లోనూ 'యువ వికాసం' దరఖాస్తుల స్వీకరణ

● ఎంపీడీవో, మున్సిపాలిటీలలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
● రేషన్ కార్డు ఉంటే.. ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకున్నా దరఖాస్తుకు అవకాశం
● ఈనెల 14 వరకు గడువు



చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులు ఇప్పటి వరకు కేవలం మీసేవ కేంద్రాల్లోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించగా తాజాగా ఆఫ్‌లైన్‌లోనూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో అధికారులు స్వీకరిస్తున్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ(ఈడబ్ల్యూఎస్) కులాలకు చెందిన నిరుద్యోగ యువత ఆయా కేంద్రాలను సంప్రదించి మ్యానువల్‌గానూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా కేంద్రాల్లో అందించిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో సిబ్బంది ఆన్‌లైన్ చేయనున్నారు. ఇది వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ఆఫ్లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించగా.. ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అంతేకాకండా దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు.

ఆదాయ ధ్రువపత్రం లేకున్నా అవకాశం

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలంటే తహసీల్దార్లు జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణపత్రం తప్పనిసరని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో వాటి కోసం రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. దీంతో సర్వర్‌లో టెక్నికల్ సమస్యలు తలెత్తి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. రేషన్‌కార్డు కలిగిన వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకున్నా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. అయితే రేషన్‌కార్డు లేనటువంటి వారు మాత్రం తప్పనిసరిగా తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఈ పత్రాలు తప్పనిసరి

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఏ విధానంలోనైనా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే తప్పనిసరిగా ఆధార్, పాన్‌కార్డు, కుల, ఆదాయ, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను జత చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు తమ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలను దానికి జత చేసి సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి అందజేస్తే సరిపోతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని వారి కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని ఆదాయం రూ.2లక్షలలోపు ఉన్నవారు మాత్రమే ఈ పథకం దరఖాస్తుకు అర్హులు. అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు కోరారు.

భవిష్యత్ తరాల మనుగడకు పర్యావరణ పరిరక్షణ చేపట్టాలి

పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణ భవిష్యత్తు తరాల మనుగడకు ఎంతో అవసరమని ప్రముఖ పర్యావరణ వేత్త రిటైర్డ్ ప్రొఫెసర్ కె.పురుషోత్తం తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఐక్యూఏసీ, రాజనీతిశాస్త్ర, జువాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత ప్రముఖ పర్యావరణ వేత్త ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుస్థిరమైన పర్యావరణ విధానాలను పాటిస్తూ సహజ వనరులు, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం సూచించారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సి.సుబ్రహ్మణ్యం పునరుత్పాదక ఇంధన వనరులు (గ్రీన్ ఎనర్జి) వాటి వినియోగంలో వస్తున్న నూతన సాంకేతికత ఆవశ్యకతలను సమగ్రంగా వివరించారు. హార యోగ (ఎన్‌జీవో) వ్యవస్థాపకుడు సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాల ఆవశ్యకతను వివరించారు. వివిధ రాష్ట్రాలనుండి 150 వరకు పరిశోధన పత్రాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, సదస్సు కన్వీనర్లు హరిబాబు, పి. అయోధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆక్రమించిన భూదాన్ భూమిని పట్టా పాసుబుక్కులు రద్దు చేసి ప్రభుత్వం వెంటనే స్వాధీనపరుచుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ శివారులోని 1030 సర్వే నంబర్ లోని 7.01 ఎకరాల భూదాన భూమిని కొమ్మూరి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన ఈ భూమి ఆక్రమణకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని తారుమారు చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట మావో, అరుణ్‌కుమార్, రవికుమార్, పోతిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా

● రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
● రోజుకు 40 నుంచి 50 ట్రిప్పులు తరలింపు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుల అండతో ధనార్జనే ధ్యేయంగా ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. అక్కన్నపేట మండలంలోని జనగామ, గౌరవెల్లి, అంతకపేట వాగుల నుంచి రోజుకు 40 నుంచి 50 ట్రిప్పుల ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

రూ.2500 నుంచి రూ.6వేలు

దూరాన్ని బట్టి ఒక్కొక్క ట్రిప్ ఇసుకకు రూ.2,500 నుంచి రూ.6 వేలు వసూలు చేస్తుండడంతో మూడు పువ్వులు-ఆరు కాయలుగా అన్న చందంగా వారి అక్రమ ఇసుక దందా సాగుతున్నది. మరికొందరు ప్రభుత్వ పనులకు ఇసుకను తరలించేందుకు అధికారుల పర్మిషన్లు తీసుకుని ఇదే అదునుగా ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తులకు ఇసుక సరఫరా చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇసుకను సమీప గ్రామాల్లోని రహస్య ప్రదేశాలలో డంప్ చేస్తూ రాత్రి వేళల్లో లారీలు తెప్పించి పట్టణ ప్రాంతాలకు సైతం తరలిస్తున్నారు. ఈ విషయమై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, లేదా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి రెండు, మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



అక్కన్నపేట మండలం జనగామ వాగులో ట్రాక్టర్‌లో ఇసుకను నింపుతున్న కూలీలు

అధికారుల సహకారం..!

అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులే.. సంపూర్ణంగా సహాయ సహకారాలు అందిస్తూ అక్రమార్కుల నుంచి మాముళ్లు తీసుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ దందా చేసేవారు అధికార పార్టీ నాయకులే ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలున్నాయి.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకునేందుకు పలువురు యువకులు ట్రాక్టర్‌లను అడ్డుకుంటున్న వారిని భయబ్రాంతులకు గురిచేస్తూ తమ ఆగడాలను కొనసాగిస్తున్నారు. వాగుల్లో ఇసుకను తవ్వడంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక దందా పగలు, రాత్రి అని తేడాలేకుండా యథేచ్చగా కొనసాగుతన్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



మండలంలోని వాగుల నుంచి ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం. ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇసుక రవాణా జరిపే అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తాం.

-ఊట్కూరి అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లింగుపల్లిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

మిరుదొడ్డి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగుపల్లి గ్రామంలో పొలాల వద్ద విద్యుత్ తీగలు నేలను తాకుతుండడంతో 'ప్రమాదాన్ని పట్టించుకోరా' అనే శీర్షికతో రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి పొలం దగ్గర విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానిక రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు

ఘనంగా రుద్రాభిషేకం, హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట సమీపంలోని కృష్ణసాగర్ దగ్గరున్న శృంగేరి శంకర మఠంలో గురువారం జగద్గురువులు శృంగేరి పీఠాధిపతులు భారతీ తీర్థనంద స్వామి 75వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేదమంత్రాల మధ్య గురువారం ఉదయం స్వామి పాదుకాపూజ, శతరుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, ఆయుష్ హోమం, చండీయాగం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మఠం సారధి కిషన్ సింగ్, వేద పండితుడు నాగరాజ శర్మ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో ఉప్పల శ్రీనివాస్, కొమరవెల్లి శివ చరణ్, శ్రీహరి, వెంకటేశ్వర్లుతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

● గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అద్భుతమైన క్యాంపస్‌లో చదువుతున్నారు.. ఆదర్శ ర్యాంకులు సాధించాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం విద్యార్థి దశలో ఐదు సంవత్సరాలు పట్టుదలతో, శ్రద్ధతో, అంకుటిత దీక్షతో చదివితే జీవితాంతం సుఖపడవచ్చన్నారు. విద్యార్థులలోని శక్తి సామర్థ్యాలను, ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి జిజ్ఞాస లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ మాట్లాడుతూ అందరి కృషి ఫలితంగా ఈ కళాశాల తిరిగి కో ఎడ్యుకేషన్‌గా మారిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాల అటానమస్‌గా మారడం గజ్వేల్ పరిసర ప్రాంత విద్యార్థుల అదృష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, కళాశాల సీపీడీసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నతిమ్మాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

'పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

ములుగు/వర్గల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గురువారం ములుగు మండలంలోని పలు గ్రామాలతోపాటు వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తమ్మలి శ్రీనివాస్, సందీప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌ఆర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట/మిరుదొడ్డి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● మద్దూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సలాఖ్‌పూర్‌లో ఏఎంసీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి సన్న బియ్యాన్ని అందించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించబోతున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్త రావాలన్నారు.

రైతులకు అండగా ఉంటా

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని, వారి బాగు కోసం ఎంత దూరమైన వెళ్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సూరంపల్లి దగ్గరున్న కెనాల్ నిర్మాణం ఇటీవల పూర్తయింది. బుధవారం కెనాల్‌ను పరిశీలించి దాని ద్వారా చెరువులు, కుంటలు నిండడంతో నీళ్లను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఆనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గాజులపల్లి పటేల్ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాణం పూర్తవడానికి అహర్నిశలు శ్రమించిన దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజీతావెంటకట్ రెడ్డి, గాజులపల్లి మాజీ సర్పంచ్ శ్రీనువాస్‌ను సన్మానించారు.

7న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

● రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రాంలింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంలింగా రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు సకల సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మారెడ్డి రాంలింగారెడ్డి ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 డిసెంబరులో జరిగిన శాసన సభ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతి రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతి రెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ స్వాతి రెడ్డి అన్నారు. గురువారం నంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్లో చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అమ్మాయిలను ఎవరైనా అవహేళన చేసిన , ఇబ్బందులకు గురి చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి న్యాయం సేవలను సేవలను పొందాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు మరుగుదొడ్లు, బాత్రూములను ఆమె పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ మొహమ్మద్ ఆసిఫ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జానయ్య, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి : డీఈవో

మద్దూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల పని విధానాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అకాడమిక్ క్యాలండర్‌కు సంబందించిన విషయాలపై ఆరా తీసి ఉపాధ్యాయుల పని విధానంపై అభినందించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రభాను, ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, ప్రశాంత్, కవిత, సీఆర్పీలు ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి



చేర్యాలలో నివాళులర్పిస్తున్న సభ్యులు

చేర్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హిందూసామ్రాజ్యాధిపతి ఛత్రపతి శివాజీ వర్ధంతిని గురువారం చేర్యాల పట్టణంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ సభ్యులు స్థానిక శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బొంగురం జితేందర్‌రెడ్డి, రాళ్లబండి చందు, దాసరి అనిల్‌కుమార్, దేశపతి చైతన్య, పెద్ది తిరుపతిరెడ్డి, మలిపెద్ది బాలలింగం, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● నంగునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శివాజీ వర్ధంతి సందర్భంగా గురువారం నంగునూరు మండల కేంద్రంలో వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు చెలికాని యాదగిరి, అనారాజు నాగ రాజు,రంజిత్, నరేష్,బద్దుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సౌకర్యాలపై ఎంపీడీవో తనిఖీ

మద్దూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఎంపీడీవో ఎస్.రాంమోహన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. కూలీలకు తప్పకుండా కనీస సౌకర్యాలైన నీడ, నీళ్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలనానరు. కూలీల కోం ఏర్పాటు చేసిన టెంట్, మంచినీళ్లపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రశంసాపత్రాన్ని అందుకున్న కమిషనర్



గజ్వేల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సీడీఎంఏ శ్రీదేవీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వరుసగా రెండు పర్యాయాలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో 80శాతానికి పైగా ఆస్తి పన్నును వసూలు చేసినందుకు గానూ ప్రశంసాపత్రాన్ని పొందారు.

దరఖాస్తుచేసిన పత్రాలు అందజేయాలి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సదరు దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాలను జతచేసి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అందజేయాలని కుకునూరుపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ గురువారం తెలిపారు. 14వ తేదీలోగా జీపీ లేదా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

బెజ్జంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ముందుగానే అరెస్టులు అప్రజాస్వామికమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు అన్నారు. అసెంబ్లీ ముట్టడికి విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు ముందుగానే అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భూముల వేలం వెంటనే నిలిపివేయాలన్నారు. అరెస్టయిన వారిలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేశ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

12 వరకు బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6 నుంచి 12 వరకు బీజేపీ ఆవిర్భా దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ తెలిపారు.గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దినోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, దూది శ్రీకాంత్ రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, గుండ్ల జనార్దన్, ఉమా రెడ్డి, శివకుమార్, శివ, రామ్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఎస్ఈగా వెంకట్ రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా గ్రిడ్ ఈఈగా విధులు నిర్వహించిన వెంకట్‌రెడ్డి పదోన్నతిపై మిషన్ భగీరథ సూపరిండెంట్ ఇంజినీర్ గా జిల్లాకు వచ్చారు. ఈ మేరకు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆయనకు సూచించారు. ఇదివరకు ఇక్కడ ఎస్ఈ గా పనిచేసిన శ్రీనివాస్ చారి పదవి విరమణ పొందారు.

దళారుల చేతిలో మోసపోవద్దు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యం విక్రయించాలని సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, డైరెక్టర్లు తిరుపతినాయక్ తదితరలుఉ పాల్గొన్నారు.

'లాఠీచార్జ్ సిగ్గుచేటు'

కుకునూరుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జ్ సిగ్గుచేటని రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. గురువారం కుకునూరుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములు రక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ తగదన్నారు. న్యాయస్థానం చివాట్లు పెట్టినా సీఎం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.



సిద్దిపేట టౌన్ : దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో గొల్లకుర్మల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొమురయ్య పెత్తందారి వ్యవస్థపై తిరగబడ్డారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.



జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్ పాదయాత్ర హోరు



కుకునూరుపల్లి : పీటీ వెంకటాపూర్ గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు జై భీమ్ జై బాబు జై సంవిధాన్ నినాదంతో జరుగుతున్న పాదయాత్రలతో గురువారం జిల్లా హోరెత్తింది. కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ఊరూరా ప్రతిజ్ఞ చేసి, పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగం సవరించడం అనే నిర్ణయాన్ని బీజేపీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు అన్ని మతాల ప్రజలు సమ న్యాయాన్ని పొందారని బీజేపీ ప్రభుత్వం వర్గ విభేదాలను మత విద్వేషాలను రెచ్చగొడుతుందని అన్నారు. రాజ్యాంగం జోలికి రావద్దని వస్తే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతాయని అన్నారు.



సిద్దిపేట అర్బన్ : పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు తదితరులు